## ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన హైకోర్ట్ పీపీ



దమ్మపేట, నవంబర్ 26: మండలంలోని అంకంపాలెం గ్రామస్తుడైన రమేష్.. హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా పనిచేస్తున్నారు. మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును ఆయన నివాసంలో ఆదివారం పీపీ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు.

## వేదాంతపురంలో వన భోజనాలు



వనంలో భోజనాలు

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 26: మండలంలోని వేదాంతపురం గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో వేంచేసిన వన దుర్గాంబిక సమేత వన లింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తులు ఆదివారం వన భోజనాలు చేశారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వన సమారాధన ఆనవాయితీ. అశ్వారావుపేట, ఉట్లపల్లి, వేదాంతపురం, నల్లబాడు, వాగొడ్డుగూడెం, గంగారం, తిమ్మాపురం తదితర గ్రామాలకు చెందిన అయ్యప్ప, భవానీ, శివ మాలధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత వన భోజనాలు చేశారు. ఏర్పాట్లను వేదాంతపురం సర్పంచ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

## కార్తీక పౌర్ణమి వేడుకలు



జ్యోతులను వెలిగిస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 26: స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు, చండీ హోమం, సాయంత్రం ఆకాశ దీపం, జ్యోతిర్లింగార్చన, జ్వాలా తోరణం, హరిహరులకు కోనేటి హారతులు కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆలయంలో జ్యోతులను వెలిగించారు. అభిషేకాలు, పూజలు చేశారు.

## 'పది స్థానాల్లో బీఆర్ఎస్‌దే గెలుపు'

మధిర, నవంబర్ 26: జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తున్న పది స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఖాయమైందని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మర్లపాడుకు చెందిన పది కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు వారు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎంపీ నామా నాగేశ్వరరావు, అభ్యర్థి లింగాల కమల్‌రాజుతో కలిసి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ జాతీయ నాయకులే మధిర వచ్చి ప్రచారం చేసే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి దాపరించిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క స్థానిక పరిస్థితులు పట్టించుకోకుండా అభివృద్ధి చేసేందుకు కూడా ముందుకు రాని పరిస్థితుల్లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న లింగాల కమల్‌రాజు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. అందుబాటులో లేని ఎమ్మెల్యే కంటే అందుబాటులో ఉంటున్న కమల్‌రాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొండపాటి వెంకటేశ్వరరావు, మొండితోక జయాకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, జే.వీ.రెడ్డి, గుర్రం రామారావు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని, నవంబర్ 26 : బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సోమవారం రామకృష్ణాపురం గ్రామ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య అన్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.



దమ్మపేట: అంబేద్కర్ కాలనీలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మెచ్చా



చంద్రుగొండ: గానుగపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వగ్గెల పూజ

### అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి

# 'కారు'లోకి వస్తున్నారు..!

దమ్మపేట, నవంబర్ 26: 'కారు' జోరందుకుంది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన-చేస్తున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ ఫలాలను చూసి ఆకర్షితులవుతున్న కాంగ్రెస్ తదితర పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు.. 'కారు' ఎక్కుతున్నారు, గులాబీ కండువా కప్పుకుంటున్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు అడుసుమిల్లి పాండు, సుబ్బారావుతోపాటు పది కుటుంబాల వారు ఆదివారం మందలపల్లి ఉప సర్పంచ్ గారపాటి సూర్యనారాయణ-అనురాధ దంపతుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మెచ్చా నాగేశ్వరరావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధిని ప్రజలంతా గమనిస్తున్నారని, అందుకే బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆయన ముందుగా, మందలపల్లిలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు-నాయకులు పైడి వెంకటేశ్వరరావు, సున్నం నాగమణి, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేష్, ఎస్‌కె.బుడే, దేవరపల్లి బుజ్జయ్య, వాసం శ్రీను, బెక్కం వెంకటేశ్వరరావు, యార్లగడ్డ బాబు, పానుగంటి చిట్టిబాబు, పానుగంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ రూప్‌సింగ్, ములకలపల్లి జడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి పది కుటుంబాల వారు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మెచ్చా నాగేశ్వరరావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

### మళ్లీ గెలిపిస్తే.. మరింత అభివృద్ధి

అశ్వారావుపేట, నవంబర్ 26: గిరిజన నియోజకవర్గమైన అశ్వారావుపేట మరింత అభివృద్ధయ్యేలా తనను గెలిపించాలని ఓటర్లకు బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓటర్లనుద్దేశించి ఆయన ఆదివారం మాట్లాడారు. గడిచిన మూడేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్లు తీసుకొచ్చినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రజల అందుబాటులోకి తీసుకొచ్చానన్నారు. నియోజకర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ''మీ కళ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నది, ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. వీటిని చూసి, కేసీఆర్ ప్రభుత్వం వచ్చేలా, కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి'' అని అభ్యర్థించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. రైతుబంధును రూ.16 వేలకు పెంచుతామని, రైతు బీమా తరహాలోనే ప్రతి మహిళకు రూ.5లక్షల కేసీఆర్ బీమా అందిస్తామని, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు జీవన భృతిగా రూ.3వేలు ఇస్తామని, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఆసరా పింఛన్‌ను రూ.5,016కు పెంచుతామని, దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తామని, అన్నపూర్ణ పథకం కింద సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

### విస్తృత ప్రచారం

చంద్రుగొండ, నవంబర్ 26: మెచ్చా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకురాలు వగ్గెల పూజ ఆదివారం మండలంలోని గానుగపాడు పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు దారా వెంకటేశ్వరరావు, సత్తి నాగేశ్వరరావు, చీదెళ్ల పవన్‌కుమార్, మేడా మోహన్‌రావు, భూక్యా రాజీ, భూక్యా శ్రీను, ఆంగోత్ శ్రీను, ఇంజం మహేష్, ఉగ్గం శ్రీను, మల్లె వెంకటేశ్వర్లు,నాగరాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ వెలుగులకు ఏడాది..!

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 26: ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీ ఇచ్చారంటే.. దానిని తప్పకుండా నిలుపుకుంటారు. ఇందుకొక ఉదాహరణ చూద్దాం. మండలంలోని అటవీప్రాంతంలో తిమ్మాపు రం, గంగారం గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయిస్తానని అక్కడి గిరిజనులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గతంలో హామీ ఇచ్చారు. ఆ రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరాను గత ఏడాది నవంబర్ 26న లాంఛనంగా ప్రారంభించారు. ఆ రెండు గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నిండి నిన్నటికి సరిగ్గా ఏడాది పూర్తయింది. తమ గ్రామాలకు విద్యుత్ వెలుగులు అందించిన మెచ్చా నాగేశ్వరరావునే గెలిపిస్తామని అక్కడి ప్రజలు చెబుతున్నారు.



గంగారంలో విద్యుత్ లైన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా (ఫైల్)



తిమ్మాపురంలో స్విచ్ ఆన్ చేసి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా (ఫైల్)

## రేపు దివ్యాంగులకు బస్ పాస్‌లు

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 26: దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్ పాస్‌లను మంగళవారం ఇవ్వనున్నట్లు ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట బస్టాండ్‌లో దివ్యాంగులు ఈ పాస్‌లను తీసుకోవచ్చని పేర్కొన్నారు.

## కారు గుర్తుకే ఓటేయండి

మధిర, నవంబర్ 26: మధిర మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి, మధిర పట్టణంలో ఆదివారం ఆయన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, స్థానిక నాయకులతో కలిసి నిర్వహించిన ప్రచారంలో నమూనా బ్యాలెట్‌ను చూపుతూ మొదటి నెంబర్‌లో ఉన్న కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. నాటి కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి చెందని మధిర మున్సిపాలిటీ నేడు కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధయిందన్నారు. అనేక సమస్యలతో ఉన్న మున్సిపాలిటీని 150 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టి పలు మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిపామన్నారు. గెలిచిన తర్వాత పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు.